

న్యాయం చేయాలని డిఎస్‌సి-98 అభ్యర్థుల వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటన చేసిన ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేయాలని, తమకు న్యాయం చేయాలని డిఎస్‌సి 98 అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం డిఇఒ కార్యాలయంలో ఉన్న డిప్యూటీ డిఇఒ రాజగోపాల్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డిఎస్‌సి 98 అభ్యర్థులు చంద్రమౌళి,చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రోస్టర్ పద్ధతి ప్రకారం పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వలేదని పేర్కొన్నారు. జిల్లాలో కేవలం 172 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చారని, 408 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు దూరమయ్యారని పేర్కొన్నారు. దీనివల్ల మా కుటుంబాలు రోడ్డున పడ్డాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఎస్‌సి 98 అభ్యర్థులు వెంకటేష్, సుధాకర్, కోటేశ్వరరావు, మధు, వెంకటరమణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

కెపి ఉల్లికి శాశ్వత కొనుగోలు కేంద్రం

హుళక్కేనా!



ఏటా అమ్మకాలకు కష్టాలే..
రెండేళ్లుగా కొనుగోళ్లు చేయని మార్క్‌ఫెడ్
రైతులను దోపిడీ చేస్తున్న ప్రయివేటు వ్యాపారులు
35 ఏళ్లుగా ఉద్యమబాటలో రైతులు

ఉల్లి పేరు వినగానే మార్కెట్లో ఎవరి నోట విన్నా ఘాటు వినిపిస్తుంది. కెపి ఉల్లి సాగు చేసిన రైతు పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఉల్లి ధరలు మార్కెట్లో పర్వాలేదు అనుకుంటే పండించిన పంటను అమ్మకం చేసేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తున్నది. కెపి ఉల్లి సాగు, రైతుల పరిస్థితి, ప్రభుత్వ కొనుగోళ్లు, అనుమతులపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం...



పొలంలో రాశులుగా పోసిన ఉల్లి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - చాపాడు

కెపి ఉల్లి రైతులకు ప్రతి సంవత్సరం కష్టాలు తప్పడంలేదు. కేంద్ర ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైకరికి కెపి ఉల్లి రైతు కంట కన్నీరుబుకుతోంది. ఉల్లిని కోస్తే కన్నీళ్లు కారటం సహజం. అయితే కెపి ఉల్లిని పండిస్తేనే కన్నీళ్లొస్తున్నాయని రైతులు వాపోతున్నారు. కెపి ఉల్లి అని పిలిచే క్రిష్ణాపురం ఉల్లి అరుదైన రకం. ఎగుమతులకే ఉద్దేశించిన రకమిది. 75 సంవత్సరాలకుపైగా చరిత్ర కలిగిన ఈ పంటను పండించే రైతులంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం చిన్నచూపుచూస్తోంది. రైతులు పండించిన ఉల్లిని మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసి ప్రయివేటు ఏజన్సీల ద్వారా విదేశాలకు ఎగుమతి చేయాల్సి ఉంది. ప్రధానంగా కెపి ఉల్లిని శ్రీలంక, సింగపూర్, మలేషియా, ఇండోనేషియా, బ్రూనై, పోర్ట్‌కెలాంగ్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రభుత్వ అలసత్వం వల్ల ఏటా కెపి ఉల్లి రైతులు నష్టపోతూనే ఉన్నారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయకపోవడంతో ప్రయివేటు వ్యాపారులు రంగప్రవేశం చేసి రైతులను దోపిడీకి గురిచేస్తున్నారు. కెపి ఉల్లి రైతులు అన్యాయానికి గురికాకుండా ఉండాలంటే మైదుకూరులో శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక్కడ ప్రభుత్వ రంగ సంస్థ అయిన మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు 35 ఏళ్లుగా రైతులు ఉద్యమబాట పట్టారు. ప్రభుత్వంలో చలనంలేదు. రైతులు ఆందోళనలు చేసుకోవాల్సిందే తప్ప కొనుగోలు కేంద్రంను తెప్పించడంలో ప్రజాప్రతినిధులు కూడా విఫలమయ్యారు. ఎన్నికల సమయంలో నాయకులు మాత్రం హామీలు గుప్పిస్తుంటారు. ఆ తర్వాత మాట మరుస్తుంటారు.

ఎగుమతులపై కేంద్రం నిషేధం

ఉల్లి ధరలు పెరిగిన సందర్భాలలో అన్ని రకాల ఉల్లిపాయల ఎగుమతులు నిషేధం విధిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేస్తున్నది. రైతుల నుంచి అభ్యర్థనలు వచ్చిన తరువాత ఎగుమతులపై నిషేధం తొలగిస్తున్నారు. అన్ని రకాల ఉల్లిపై ఆంక్షలు కొనసాగనున్నాయని ప్రకటించిన సందర్భంలో స్థానికంగా అమ్మకం కాని విదేశీ రకం కెపి ఉల్లి పండించే రైతుల్లో ఆందోళన మొదలవుతున్నది. దేశవ్యాప్తంగా ఉల్లి ధరలు రెక్కలు వచ్చినవేల కేంద్రం దిద్దుబాటు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంటుంది. దేశీయ మార్కెట్లో ఉల్లి లభ్యత పెంచడం ఉల్లి ధరను నియంత్రించే లక్ష్యంగా ఈ నిషేధం విధిస్తున్నారు. డిజిఎఫ్‌టి డైరెక్టర్ జనరల్ (ట్రేడ్) నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రతి సారి రైతుల్లో ఆందోళన చెందుతున్నారు. ఉల్లి పండించిన రైతులు పంటను అమ్ముకునేందుకు మాత్రం నానా కష్టాలు పడాల్సి వస్తుంది. ఈ సమస్య తొలగాలంటే కెపి ఉల్లి ఎగుమతులపై శాశ్వతంగా నిషేధం ఎత్తివేయాలి.

దోపిడీకి గురవుతున్న రైతులు

ప్రతి సంవత్సరం కెపి ఉల్లి రైతులు ప్రయివేటు వ్యాపారుల దోపిడీకి గురవుతున్నారు. ఉల్లిని మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసి విదేశాలకు ఎగుమతి చేయాల్సి ఉంది. గిట్టుబాటు ధర కోసం రైతులు ఆందోళనకు దిగినప్పుడు మాత్రం మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగి కొనుగోళ్లు చేస్తుంది. ఆ తర్వాత అడ్రస్‌లేకుండా పోతుంది. రెండు సంవత్సరాలుగా మార్క్‌ఫెడ్ ఉల్లిని కొనుగోలు చేయడంలేదు. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రయివేటు వ్యాపారులు తమకు అవసరమైన మేరకు మాత్రమే ఉల్లిని కొనుగోలు చేస్తారు. రెండవ రకాన్ని కొనుగోలు చేయరు. బయట ఈ ఉల్లిని అమ్ముకునేందుకు రైతులకు వీలుకాదు. మార్క్‌ఫెడ్ అయితే రైతుల నుంచి ప్రతి గడ్డను కొనుగోలు చేస్తుంది. అప్పుడు రైతులు కొంత మేరకు లాభపడేందుకు వీలుంటుంది. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు మంచి గిట్టుబాటు ధర కూడా లభించే అవకాశం ఉంది. ఉల్లినే వ్యాపారంగా మార్చుకున్న కొందరు వ్యాపారులు ఎలాగైనా ఎక్కువ ధర చెల్లించి ఉల్లిని కొనుగోలు చేసేందుకు వీలుంటుంది.

తగ్గుతున్న ఉల్లి విస్తీర్ణం

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఏడాదికేడాది కెపి ఉల్లి సాగు గణనీయంగా తగ్గుతూ వస్తోంది. ప్రతి సంవత్సర 15 వేల ఎకరాల్లో సాగయ్యే ఉల్లి ఇప్పుడు ఐదు వేల ఎకరాలకు పడిపోయింది. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకనే ఈ పంట సాగు పడిపోయింది. కడప జిల్లాలోని మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం, కలస పాడు, పోరుమామిళ్ల మండలాలతో పాటు కర్నూలు జిల్లాలోని ఆళ్లగడ్డ, చాగలమర్రి, ప్రకాశం జిల్లాలోని గిద్ద లూరు ప్రాంతాల్లో ఈ రకం పంటను సాగు చేస్తారు. శాశ్వత కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతుల్లో సాగుపై ఆసక్తి తగ్గిపోతోంది.



అమ్మకం కష్టంగా మారుతోంది



కెపి ఉల్లి పంటను నూర్పిడిచేసిన తరువాత అమ్మకాలు చెపడదామంటే కొనుగోలుదారులు ముందుకు రావడం లేదు. ఉల్లి పంట ఎన్నో ఏళ్లుగా సాగు చేపడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం ఎగుమతులపై నిషేధం విధించిన సందర్భంలో అమ్మకం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. ప్రభుత్వం మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి. **- రామసుబ్బారెడ్డి రైతు, దువ్వూరు.**

శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



కెపి ఉల్లి మన ప్రాంతంలో మాత్రమే సాగు అయ్యే ప్రత్యేక రకానికి చెందినది. సాగుకు అధిక ఖర్చులు అవుతున్నాయి. అమ్మకం సమయంలో చాలా అవస్థలు పడాల్సిన అవసరం ఏర్పడుతున్నది. ప్రభుత్వం శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే సాగుకు ఆసక్తి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఉల్లి ధరలు పెరిగిన సమయంలో ఎగుమతికిపై నిషేధం విధిస్తుండడంతో ఆ ప్రభావం ఉల్లిపై పడుతున్నది.

- బి.పెద్ద పుల్లారెడ్డి, చల్లబసాయపల్లె, దువ్వూరు.

అమ్మకం కష్టంగా మారింది



కెపి ఉల్లి ఎగుమతులపై ప్రభుత్వం నిషేధం విధిస్తుండటం, స్థానికంగా కొనుగోలు కేంద్రం లేకపోవడంతో అమ్మకం చాలా కష్టంగా మారుతున్నది. ఎన్నో ఏళ్ల నుండి ఉల్లి సాగు చేస్తున్నాం. గత ఏడాది అమ్మకం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోలు చేయాలి. ఉల్లి కొనుగోలుకు శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

- కె మద్దిలేటి, చింతలెరువు, చాగలమర్రి, నంద్యాల జిల్లా.

ఆర్ఎస్ఎస్ నియంత్రణలో

బిజెపి పాలన

- లౌకిక రాజ్యం స్థానంలో హిందూ రాజ్యం ఏర్పడితే పెను ప్రమాదం

- ప్రచార భేరిలో సిపిఎం, సిపిఐ నాయకులు



ప్రచార భేరిలో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - బద్వేలు

ఆర్ఎస్ఎస్ నియంత్రణలో బిజెపి పాలన కొనసాగుతోందని లౌకిక రాజ్య స్థానంలో హిందూ రాజ్యం ఏర్పడితే పెనుప్రమాదం వాటిల్లుతుందని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు జి. చంద్రశేఖర్, చంద్ర పేర్కొన్నారు. ప్రచార భేరిలో భాగంగా శనివారం డాక్టర్ అంబేద్కర్ విగ్రహం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలోని బిజెపి ప్రభుత్వం దళితులు, మైనార్టీలను నిర్లక్ష్యం చేస్తోందని పేర్కొన్నారు. ముస్లిములపై, క్రిష్టియన్లపై హిందుత్వ మూకలు గో రక్షణ పేరిగా దాడులు చేస్తున్నాయని వాపోయారు. ప్రజల ఆహారంపై ఆంక్షలు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు రాజ్యాంగం కల్పించిన కమిషన్ హక్కులను పార్లమెంట్‌లో రద్దుచేస్తున్నారని, దేశ వ్యాప్తంగా అంబేద్కర్ ప్రవేశపెట్టిన ఎంప్లాయిస్ ఎక్చెంజ్ శాఖనే నామ రూపాలు లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి కనుసన్నల్లో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు రాజకీయాలు చేస్తున్నాయని చెప్పారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని మూడు పార్టీ పల్లెంత మాట కూడా అనలేకపోతున్నాయని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా, కడప ఉక్కు, రాజధాని, పోలవరానికి నిధులు రాబట్టుకోలేని దౌర్భగ్య స్థితికి రాష్ట్ర ప్రభుత్వం చేరిందని తెలిపారు. ప్రభుత్వం దేశంలో నిరంకుషత్వంగా పరిపాలన సాగిస్తోందని, ఆహారంపై నిషేధం పెడుతోందని, దేశంలో ఫెడరల్ వ్యవస్థను ప్రక్కన పెట్టి ఒకే బాష, ఒకే సంస్కృతి ఒకే ఆహారం అనే విధానాలు పెడుతుందన్నారు. బిజెపిని గద్దె దించాల్సిన అవసరమెంతైనా ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.వీరశేఖర్, డివిజన్ సహాయ కార్యదర్శి పి.సి.ఎం.రాజు, సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు పి.చాంద్ బాషా, సిపిఎం బద్వేల్ రూరల్ కమిటీ కార్యదర్శి డి.వెంకటేష్. సిపిఐ జిల్లా సమితి సభ్యులు పి.వి.రమణ, పట్టణ కార్యదర్శి బాలు, గోపవరం మండల కార్యదర్శి పెంచలయ్య, సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ సభ్యులు ఇ.రమణ, గిలక రాజు, ఎస్ .మస్తాన్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని , డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ ఉపాధ్యక్షులు షరీఫ్, నాగార్జున చేతి వృత్తిదారుల నాయకులు పి.నాగరాజు. బిల్డింగ్ వర్కర్స్ నాయకులు రాయప్ప, సిపిఎం, సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటోనగర్‌కు స్థలం కేటాయించండి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో ఆటోమొబైల్ రంగంలో పనిచేస్తున్న వారి కోసం కొప్పర్తి పారిశ్రామికవాడలో ఆటోనగర్‌కు అవసరమైన స్థలం కేటాయించాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్, నగర కమిటీ సభ్యులు పారుక్ హుస్సేన్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని పాత బస్టాండ్ లో ఉన్న సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరం రోజురోజుకూ అభివృద్ధి చెందుతోందని, ఇలాంటి పరిస్థితిలో ఆటో రంగంలో కూడా అవసరమైన విస్తరణ జరుగుతోందని పేర్కొన్నారు. రాయలసీమ నడిబొడ్డున నగరం ఉందని, అందువల్ల మెకానిక్ పనుల కోసం ఇతర ప్రాంతాల నుంచి కడపకు వస్తున్నారని తెలిపారు. కడపలో దాదాపు వెయ్యి మంది దాకా ఆటోమొబైల్ రంగం మీద ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం నడుస్తున్న గ్యారేజీలు బాడుగుల చెల్లించలేని స్థితిలో ఉన్నారని, దీని కారణంగా గ్యారేజ్ నడిపే మెకానిక్స్ తీవ్ర కష్టాలు పడుతున్నారని చెప్పారు. 30 సంవత్సరాల కిందట ఆటోనగర్ ఏర్పాటు కోసం 13 ఎకరాల స్థలం కేటాయించారని, కానీ పెరుగుతున్న ప్రజల అవసరాల దృష్టిలో పెట్టుకుని ఆ స్థలం సరిపోవడం లేదని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొప్పర్తి పారిశ్రామికవాడలో ఆటోనగర్ కోసం ప్రత్యేకంగా 150 ఎకరాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.

తెలుగువారి శౌర్యానికి ప్రతీక ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

వైవీయూలో అలరించిన నాటక ప్రదర్శన

ప్రజాశక్తి - కడప అర్బన్



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నాటక ప్రదర్శనలో కళాకారులు

తెలుగువారి శౌర్యానికి ప్రతీక ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని వైవీయూ విసి ఆచార్య జింక రంగ జనార్ధన్, రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, లలిత కళల విభాగం సమన్వయ కర్త డాక్టర్ కోట మృత్యుంజయరావు పేర్కొన్నారు. శనివారం యోగి వేమన విశ్వవిద్యాలయంలో కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా లలితకళల విభాగం ఆధ్వర్యంలో ఆర్ట్స్ బ్లాక్‌లోని సురభి సమావేశ మందిరంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. నాటకానికి దర్శకత్వం వహించిన ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పాత్రను పోషించారు. దుర్యోధనుడుగా తూపల్లి చిరంజీవి, సాధ్వి ద్రౌపదిగా మీసరగండ గాయత్రీ దేవి, శకునిగా బోయ రంగ నాయకులు, రుద్రమదేవిగా షేక్. కిలీఖత్ తస్లీమ, ఝాన్సీ లక్ష్మీ బాయిగా గోసాల నాగమణి, రామణుడుగా పగడపూల దేవరాజు ఏకపాత్రాభినయాలు చేసి ప్రేక్షకుల మన్ననలందుకున్నారన్నారు. కార్యక్రమానికి పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్ ఈశ్వర్ రెడ్డి, ఎల్. సుధాకర్, ఇంటాక్ చైర్మన్ లయన్ చిన్నపరెడ్డి, సాహితీవేత్త అలపర్తి పిచ్చయ్య చౌదరి, విద్వాన్ గానుగపెంట హను మంతరావు కార్యక్రమానికి హాజరై కందుకూరి వీరేశలింగం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాటకంలోని పాత్రధారులకు అతిథులు జ్ఞాపికలు బహుకరించారు. వలస గాండ్ల సుధాకర్ సంగీతం అందించారు. డాక్టర్ టి. సురేష్ బాబు, సుబ్బరాయుడు సహకారం అందించగా, విద్యార్థులు, అధ్యాపకులు, స్కాలర్లు, సాహితీ, నాటక ,సంగీత ప్రియులు పాల్గొన్నారు.


నీలి శ్రీనివాసరావు సేవలు మరువలేనివి



నీలి శ్రీనివాసరావును సన్మానిస్తున్న తులసిరెడ్డి, నాయకులు

కడప: క్రమ శిక్షణ సమయ పాలన అంకిత భావంతో పార్టీ కోసం పని చేసిన వ్యక్తి నీలి శ్రీనివాస రావు, ఆయన పార్టీకి చేసిన సేవలు మరువ లేనివని పిసిసి మీడియా చైర్మన్ ఎన్. తులసిరెడ్డి పేర్కొన్నారు. రెండున్నర సంవత్సర కాలం పాటు కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన నీళ్ల శ్రీనివాసరావుకు 1998 డిఎస్సీ లో టీచర్‌గా ఉద్యోగం రావడంతో పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయన్ను శనివారం ఉదయం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ తరపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ నీలి శ్రీనివాసరావు క్రమశిక్షణ కలిగిన సైనికుడిలా కడప జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిని సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా నిర్వహించారని కొనియాడారు. నీలి శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలుగా తనకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్ అహ్మద్, కాంగ్రెస్ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి, ఏఐసీసీ సభ్యులు, పిసిసి డెలిగేట్ బండి జకరయ్య, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, నాగరాజు, పూల నజీర్, వెంకటరమణారెడ్డి, ప్రసాద్ బాబు, లేబర్ సెల్ జిల్లా అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య, ఆరిఫ్ ఉల్లా, నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, వుత్తన్న, నాగార్జున, వెంకటేష్, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ, కుళ్లాయప్ప, సూరాడు, లావణ్య, కృష్ణారెడ్డి, యేసయ్య, సిరాజుద్దీన్, కృష్ణమూర్తి, పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



విద్యార్థులతో సంస్థ సభ్యులు, సంఘం నాయకులు

కడప : ప్రకాష్ నగర్‌లోని సుభాష్ చంద్రబోస్ విద్యార్థి ఆవాసం (జెఎస్‌ఒస్ అర్బన్ హాస్టల్)కు ఆర్‌కె హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వారి సహకారంతో, మీకోసం సేవా సంస్థ ఆధ్వంలో ఇరవై వేల రూపాయల విలువచేసే నిత్యావసర వస్తువులు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కడప జిల్లా తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్యా సుధాకర్ , తొగటవీర క్షత్రియ సంఘం జిల్లా యువజన అధ్యక్షులు, 21వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి మోతుకూరు సుబ్బారాయుడు చేతుల మీదుగా నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో మీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణు వర్ధన్ ,ఈశ్వర చారిటబుల్ ట్రస్టు పాపన రాజశేఖర్ రెడ్డి, మడక శ్రీకాంత్,అర్బన్ హాస్టల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

బస్టాండ్ నిర్మాణానికి భూమిపూజ

వల్లూరు : కమలాపురం పట్టణంలో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించబోయే బస్టాండ్‌కు శనివారం ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్ల కిందట కమలాపురంలో నిర్మించిన బస్టాండ్ శిథిలావస్థలకు చేరుకోవడంతో ప్రజల, ప్రయాణికుల అభ్యర్థన మేరకు బస్టాండ్‌ను పునర్నిర్మిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి రామాంజులరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెసిఎస్ మండల రూరల్ అదనపు ఇన్‌ఛార్జిగా చల్లా అన్వేష్‌రెడ్డి

చెన్నూరు: జెసిఎస్ మండల రూరల్ అదనపు ఇన్‌ఛార్జిగా మండలంలోని ఓబులంపల్లె గ్రామానికి చెందిన చల్ల అన్వేష్ రెడ్డి నియమితులయ్యారు,. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కమలాపురం శాసనసభ్యులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డికి, చింతకొమ్మదిన్నె జడ్‌పిఇసి రామాంజులరెడ్డికి, జెసిఎస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ చల్ల మధుసూదన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు మండల వ్యాప్తంగా అన్ని సచివాలయ పరిధిలో ఇంటింటికి తిరిగి ప్రజలకు ముఖ్యమంత్రి అమలుచేస్తున్న పథకాలను తెలియజేయడంతో పాటు, వైసిపి బలోపేతానికి తమ వంతు బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు.

ప్రహరీ కూల్చడం దుర్మార్గం : టిడిపి

ప్రజాశక్తి- కడప అర్బన్

టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్‌బాబుకు చెందిన రహమతీయ ఫంక్షన్ ప్యాలెస్ ప్రహరీ గోడను కార్పొరేషన్ వారు కూల్చివేయడం దుర్మార్గమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి హరి ప్రసాద్ అన్నారు. శనివారం కూల్చివేసిన ప్రహరీ గోడను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమీర్ బాబు వైసీపీ ప్రభుత్వం చేస్తున్న నీచమైన పరిపాలన గురించి, ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తూ ఉన్నారని చెప్పారు. ఆయన గొంతు నొక్కాలని వైసిపి ప్రభుత్వం చూస్తు ఒదని విమర్శించారు. స్థలం హైకోర్టులో ఇంజక్షన్ ఆర్డర్ కాపీ ఉండగా ప్రహరీని కూల్చడం దారుణమని చెప్పారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌ని కలిసి డాక్యుమెంట్స్, హైకోర్టుకు సంబంధించిన ఇంజక్షన్ ఆర్డర్ కాపీని చూపించారు. ఈ విషయంపై స్పందించిన కమిషనర్ తగిన విచారణ చేసి న్యాయం చేస్తానని చెప్పారు.



సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులతో పాఠశాల డైరెక్టర్

పీస్ స్కూల్‌లో కాన్వగేషన్ డే సంబరాలు

కడప అర్బన్ : పీస్ స్కూల్‌లో ప్రీ స్కూల్ కాన్వగేషన్ డే సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పీస్ డైరెక్టర్ సయ్యద్ గౌస్ పీర్ అధ్యక్షత వహించారు. తమ అమూల్య మైన సందేశాన్ని అందించారు. విద్యార్థులు తెలుగు పద్యాలను, బుడి బుడి అడుగులతోను డాన్స్‌లతో అలరించారు. పీస్ స్కూల్ డైరెక్టర్ కిండర్ గార్డెన్ పూర్తిచేసుకున్న విద్యార్థులకు కాన్వగేషన్ సర్టిఫికెట్‌లను అందించి ప్రోత్సహించారు. విద్యార్థులకు ఎస్ఎ -2 పరీక్షలలో మొదటి ర్యాంక్, రెండవ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు, సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందించారు. క్రమశిక్షణ, మంచి చేతిరాత, గుడ్ కమ్యూనికేషన్, రెగ్యులరిటీ ఇన్ స్కూల్, స్టార్ అఫ్ ది ఇయర్ సర్టిఫికెట్స్, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తారిఖ్ అలీకి బ్రెట్‌లీ అవార్డు

కడప అర్బన్ : ముంబై నగరంలోని హాలీడే ఇన్ ఫంక్షన్ హాల్‌లో టైం మీడియా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు బ్రెట్ లీ చేతుల మీదుగా ఉత్తమ సేవ పురస్కారం ఇండియా బ్రాండ్ ఐకాన్ సర్వీస్ ఎక్సలెన్స్ బ్లడ్ డొనేషన్ ఇనిటియేటివ్ అవార్డ్ ఫర్ ఇయేర్ - 2022ని ఖున్ కా రిష్తా ఛైర్మన్ యం.తారిఖ్ అలీ అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సకాలంలో రక్తం దొరక్క చనిపోతున్న అభాగ్యులని కాపాడుకోవాలనే దృఢసంకల్పంతో 2015వ సం వత్సరంలో "ఖూన్ కా రిష్తా చారిటబుల్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాను స్థాపించామని తెలిపారు. 8 సంవ త్సరాలు నుంచి ఆంధ్ర రాష్ట్రంలో రక్త దానం ఆవశ్య కతను తెలియజేస్తూ అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.



అవార్డు అందుకున్న తారిఖ్ అలీ



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారి

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-కడప సిటీ

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరమని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి పి. బాసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం అగ్నిమాపక కేంద్రం పరిధిలోని రవీంద్రనగర్‌లో ఉన్న గంగమ్మ గుడి వద్ద ప్రజలకు ఎస్‌పిజి గ్యాస్ వినియోగంలో ఏర్పడే ప్రమాదాలు, నివారణ గురించి వివరించారు. ముఖ్య అతిథిగా కడప కార్పొరేటర్ రెడ్డి ప్రసాద్ హాజర య్యారు. అలాగే భాకరాపేట హెచ్‌పిసిఎల్ వద్ద అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలకు కర పత్రాలు పంపిణీ చేశారు. ఎలాంటి అగ్ని ప్రమాదాలు సంభవించినా వెంటనే 101, 08562 242299లలో సంప్రదించాలని సూచించారు. **పోరుమామిళ్ల టౌన్** : అగ్ని ప్రమాదాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక అగ్నిమాపక కేంద్ర అధికారి ఎల్. వసంతనాయక్ పేర్కొన్నారు. శనివారం అగ్నిమాప వారోత్సవాల్లో భాగంగా అంబేద్కర్ సర్కిల్, ఆర్‌టిసి బస్టాండ్‌లలో అగ్నిమాపక వాహనంతో సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించారు. దుకాణ యజమానులకు, ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అగ్నిమాకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిగ్గుతేలేనా?

ప్రజా'దృష్టి'

కడప కార్పొరేషన్ చెత్తబుట్టల కొనుగోల్‌మాల్ వ్యవహారాన్ని నిగ్గుతేల్చాలి. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో పాలనా వ్యవస్థ ఇష్టారాజ్యంగా సాగిపోతుందనే విమర్శకు ఆస్కారకాన్ని కలిగించినట్లు అవుతుంది. ఇటీవలి కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీ సభ్యులే చెత్తబుట్టల కొనుగోలుమాల్ వ్యవహారం నడిచిందని, దానిపై వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ కార్పొరేటర్లు అవినీతి వ్యవహారాన్ని వెలుగులోకి తేవడాన్ని గమనిస్తే ఏస్థాయిలో వ్యవహారం నడిచిందనే భాష్యాలు, విమర్శలు వెల్లువెత్తే అవకాశం ఉంది. కార్పొరేషన్ పరిధిలోని 87 వేల నుంచి లక్ష ఇళ్లకు రూ.60, రూ.90 చొప్పున చెత్త పన్ను వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే. చెత్త పన్ను వసూళ్లపై వామపక్షాలు, ఇతర ప్రతిపక్షాలు పెద్దఎత్తున ఆందోళనలు చేసిన నేపథ్యంలో విమర్శలు పెల్లుబికే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కమిషనర్ పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించడం తెలిసిందే. అంచనాలకు మించి పన్ను వసూలు చేయడంపై సమావేశంలో ప్రశంసలు కురిసింది. పెద్ద మొత్తంలో ప్రజాధనం వెచ్చించి చెత్త బుట్టల కొనుగోలు చేసి ఉంటారనడంలో సందేహం లేదు. చెత్తబుట్టల అవినీతి వ్యవహారంలో పాత్రధారులు, సూత్ర ధారులు ఎవరెవరనే అంశం నిగ్గు తేలాల్సిందే. ఎంత మొత్తంలో కొనుగోలు చేశారో, ఎంత నగదు చెల్లించారు. ఎంత గోల్‌మాల్ నడిచిందనే వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. కార్పొరేషన్ పరిధిలో సచివాలయాలకు చెందిన రెవెన్యూ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్త పన్నులు వసూలు చేస్తున్న నేపథ్యంలో ప్రజాధనం పక్కదారి పట్టడం ప్రజల్లో వ్యతిరేకతను పెంచే అవకాశం ఉంది. ఇటువంటి వ్యవహా రం పన్ను వసూళ్లపైనా పడే అవకాశం ఉందనే సత్యాన్ని గ్రహించాలి. పాత్రధారులను, సూత్రధారులను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. కార్పొరేషన్‌లో ప్రతిపక్షం కరువైన నేపథ్యంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే భావించాల్సి ఉంది. కార్పొ రేషన్ ప్రజానీకం చెల్లించిన పన్నులను ఇష్టారాజ్యంగా ఖర్చు చేయడం హేయనీయం. ఏకపక్ష మెజార్టీ లభిస్తే ఎక్కడైనా ఇటువంటి అవినీతి వ్యవహారాలకు అస్కారం ఇచ్చినట్లు అవుతుందనే సత్యం మరోసారి రుజువు అయినట్లు తెలుస్తోంది. ఇంటింటికీ వెళ్లి రాబట్టిన పన్ను వసూళ్లను సద్విని యోగం చేయాల్సిన అవసరం కమిషనర్‌పై ఉందనడంలో సందేహం లేదు. ఎంతటి దృఢసంకల్పంతో పన్ను వసూలు చేశారో, అంతే దృఢసంకల్పంతో చెత్తబుట్టల అవినీతి వ్యవ హారాన్ని వెలుగులోకి తేవాల్సిన బాధ్యత ఉంది. అవినీతి వ్యవహారంలో పాత్రధారులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉంది. భవిష్యత్‌లో ప్రజాధనాన్ని స్వాహా చేయాలకునే నాయకులకు ఎప్పటికీ గుర్తుండిపోయేలా చర్యలు తీసుకోవాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

నిబంధనలు అతిక్రమించి ఇసుక తవ్వకాలు


మాట్లాడుతున్న పుట్టా సుధాకర్ యాదవ్

ప్రజాశక్తి - ఖాజీపేట

వైసిపికి చెందిన నాయకులు సహజ వనరులను విచ్చలవిడిగా కొల్లగొడుతూ అక్రమంగా కోట్లు ఆర్జిస్తున్నారని, ప్రభుత్వ నిబం ధనలు అతిక్రమించి ఇసుక తవ్వకాలు చేపడుతూ పర్యావరణానికి హాని కలిగిస్తున్నారని మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ విమర్శించారు. మండల పరిధిలోని ములపాక సమీపంలో ఉన్న ఇసుక క్వారీని శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పుట్టా మాట్లాడుతూ ఇసుక తవ్వకాల్లో ప్రభుత్వ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కారని అక్రమ రవాణాకు ప్రత్యక్షంగా సహకరిస్తూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారని అన్నారు. దీనిపై భూగర్భ గనుల శాఖ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదన్నారు. ఇక న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బాలిశెట్టి హరిప్రసాద్, మండల టిడిపి అధ్యక్షులు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, కడప మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, రామానాయుడు, బాలకృష్ణ యాదవ్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె గంగాధర్, జెండాల మహబూబ్ బాషా, పుల్లయ్య నాయుడు, బండి చిన్న, హజరత్ యాదవ్, రెడ్యం వెంకట్రామిరెడ్డి, నరసింహులు యాదవ్, బాలకొండారెడ్డి, జానకిరామ్, హరినాథ్‌రెడ్డి, నంద్యాల సుబ్బయ్య, సరిటాల వీరయ్య, ఐటిడిపి ప్రతినిధి పాపన మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

టీకా పిల్లలకు రక్షణ : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - జమ్మలమడుగు


టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డిఎంహెచ్‌ఒ నాగరాజు

చిన్న పిల్లలకు, గర్భవతులకు టీకా రక్షణ అని డిఎం హెచ్‌ఒ నాగరాజు తెలి పారు. పట్టణంలోని కన్నె ల్లూరు, యత్తపుకాలనీ, ముద్దనూరు రోడ్డు, కోట వీధి, నమాజ్ కట్ట సచి వాలయాల్లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ టీకాల వివరాలు అడిగి, సిబ్బందికి సూచనలు చేశారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఉమా మహేశ్వర్ కుమార్, జమ్మల మడుగు డివిజన్ వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.శాంతికళ, కన్నెలూరు, నాగలకట్ట ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అగ్నిప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి రఘునాథ్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక శివాలయం సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అగ్నిప్రమాదాలపై అవ గాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం సంభవిస్తే ఎలా స్పందించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం అగ్నిమాపక శాఖకు చెందిన వివిధ రకాల బ్రాంచ్‌లతో నీటి ప్రదర్శన నిర్వహించారు. లాంగ్ బ్రాంచ్, షార్ట్ బ్రాంచ్, డిఫ్యూజర్ బ్రాంచ్, ట్రిపుల్ పర్పస్ నాజిల్, ఆక్రాన్ నాజిల్, రివాల్వింగ్ బ్రాంచ్‌లను ఉపయోగించి నీటి విన్యాసాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


నీటి విన్యాసాలు ప్రదర్శిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పులివెందుల రూరల్ : అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పులివెందుల అగ్నిమాపక అధికారి రామకృష్ణ సూచించారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణ, తీసుకోవలసిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. పాత బస్టాండ్, పూల అంగళ్ల సర్కిల్, పార్నపల్లి రోడ్డు, ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంతాల్లో సిబ్బంది కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం వారు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రలో వేంపల్లె నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రలో శనివారం వేంపల్లెకు చెందిన టిడిపి నాయకులు ఆయనను కలిసి సంఘీభావం తెలిపారు. నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలోని పోలి మేరమెట్ట వద్ద టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ ఆధ్వర్యంలో లోకేష్‌ను గజమాలతో సత్కరించారు. రాంపల్లె గ్రామం వద్దకు సాగిన పాదయాత్రలో వేంపల్లె నాయకులు పాల్గొన్నారు. టిడిపి రాష్ట్ర ఉపా ధ్యక్షుడు పార్థసారథిరెడ్డి, జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు బాల స్వామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ ఎద్దుల కొం డయ్య, మాజీ వార్డు మెంబరు నల్లగారి కృష్ణారెడ్డి, పివి రమణ, పూల అల్లా భక్షు, గొటూరు నాగభూషణం, మహమ్మద్ షరీఫ్, గోపాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శేఖర్, శేషగిరి, కాటమయ్య, శివయ్య పాల్గొన్నారు.

రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తం : ప్రవీణ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రపాలన అస్తవ్యస్తంగా తయారైందని టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మళ్లీ పాలన గాడిన పడాలంటే యువతలో చైత న్యం రావాలని, జగన్‌రెడ్డి పోయి, చంద్రబాబు రావా లని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక రాజీవ్ సర్కిల్ నుండి టిడిపి కార్యకర్తల ఆధ్వ ర్యంలో శనివారం మన రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ఆయా అవార్డులలో ఇంటిం టికీ తిరుగుతూ వైసిపి అరాచక పాలన గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి తాటి శ్రీనివాసులు యాదవ్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి నల్లబోతుల నాగరాజు, కొట్టాల జగన్, కడప జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి, సరసుర శ్రీనివాసులు, 9వ వార్డు కరీముల్లా, గోపవరం గౌస్, భగత్‌సింగ్ కాలనీ పట్నం మాబాషా, ఇర్ఫాన్, శివ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నిమ్మ రైతులకు అవగాహన

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గూడెంచెరువు, పి.బొమ్మేపల్లి, గండికోట గ్రామాల్లో నిమ్మ రైతులకు పాటించవలసిన యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల చీడపీడలపై ఉద్యాన అధికారి జయభరతరెడ్డి అవగాహన కల్పించారు. ఆ మేరకు ఆయన శనివారం నిమ్మ తోటలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లా డుతూ ప్రస్తుతం అధిక ఉష్ణో గ్రతల నేప థ్యంలో క్రమం తప్పకుండా నీటి తడులు మొదలకు నీళ్లు తగలకుండా ఇవ్వాలన్నారు. బోరాన్ 2 గ్రాములు లీటర్ నీటికి ఇస్తే కాయ పగులును నివారించవచ్చునని తెలిపారు. కాయలకు అధిక ఎండ దెబ్బ తగలకుండా యూరియా ద్రావణం 10 గ్రాములు లీటర్ నీటికి పిచికారీ చేయాలన్నారు. ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారి జయభరత్‌రెడ్డి

బిల్లు చూస్తే షాక్!



- సామాన్యుడిపై విద్యుత్ ఛార్జీల మోత
- తెలియకుండానే ట్రూ అప్ ఛార్జీల వసూళ్లు
- వేసవిలో మరింత భారంగా బిల్లు
- విలవిలలాడుతోన్న వినియోగదారుడు

గతంలో బిల్లులు ఇలా.. (2022 జులై వరకు)

యూనిట్లు	గ్రేడు	మొత్తం (రూ.)
0-50	ఏ	1.45
51-75	ఏ	2.60
0-50	బి	2.60
51-100	బి	2.60
101-200	బి	3.60
201-225	బి	6.90
0-50	సి	2.65
51-100	సి	3.36
101-200	సి	5.40
201-300	సి	7.10
301-400	సి	7.95
401-500	సి	8.50

ప్రస్తుతం (2022 ఆగస్టు నుంచి)

యూనిట్లు	గ్రేడు	మొత్తం (రూ.)
0-30	ఏ	1.45
31-75	ఏ	2.80
0-100	బి	4.00
101-200	బి	5.00
201- 300	బి	7.00
300 అపైన	బి	7.50

ప్రజాశక్తి - కడప

ఓ పక్క రోజు రోజుకూ మండుతున్న ఎండలు.. మరోపక్క బిల్లు పట్టుకుంటే విద్యుత్‌షాక్.. వెరసి సామాన్యుడు విలవిలాలాడుతోన్నాడు. దిక్కుతోచని పరిస్థితుల్లో పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు కొట్టుమిట్టాడుతున్నారు. కరెంటు బిల్లులు ఇంటికి వచ్చాయంటే ఒకటే టెన్షన్. బిల్లు చూస్తే కరెంట్ షాక్ కొట్టినట్టే. బిల్లులో వేలకు వేల రూపాయలు చెల్లించాలని చూసిన వెంటనే పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఆందోళనకు గురవ తున్నారు. ఓ ఇంట్లో నలుగురుంటే వారు తమ జీవ నోపాధి కోసం ఇంటి నుంచి ఉదయం వెళితే తిరిగి వచ్చేసరికి సాయంత్రం 6 గంటలు పైనే అవుతుంది. కేవలం రాత్రి వేళల్లో ఒక ఫ్యాను ఒక లైటు వేసు కుంటారు. అటువంటి వారికి కూడా కరెంటు బిల్లులు వేలల్లో వస్తున్నాయంటే అతిశయోక్తి ఉంది. ప్రస్తుత ప్రభుత్వాల పాలనలో అన్ని రేట్లు విపరీతంగా పెరి గాయి. నిత్యావసర సరుకులతో పాటు గ్యాస్, పెట్రోల్ ధరలు ఆకాశాన్ని అంటాయి. ఇవే భరిం చలేని స్థితిలో ఉన్న పేద మధ్య తరగతి సామాన్య ప్రజానీకానికి కరెంటు బిల్లులు మూలిగే నక్కపై తాటికాయపడ్డ చందంగా మారింది. కూలీనాలీ చేసుకుని వచ్చిన డబ్బులు అంతా కరెంటు, గ్యాస్ బిల్లులకే సరిపోతే ఇక ఆజీవనం ఎలా సాగించాలి? పిల్లలను ఎలా చదివించాలి అనే దిగులుతో సామా న్యులు కొట్టుమిట్టాడుతున్నారు. పైగా విద్యుత్ సంస్థలు ట్రూప్ అప్ ఛార్జీలను వినియోగదారులకు తెలియకుండా బిల్లులో కలిసి ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి.

గతంలో గృహ అవసరాలకు 75 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకుంటే వీరు గ్రూప్ -ఏ కిందికి వస్తారు. 75 నుంచి 225 యూ నిట్లు వాడిన వారికి మరో రేటు ఉంటుంది. వీరు గ్రూప్- బి కిందికి వస్తారు. 225 యూనిట్లు పైన వాడే వారిని గ్రూప్ -సిగా పరిగణిస్తారు. ఇలా 2022 జులై వరకు వసూలు చేసేవారు. కొత్తగా ఆగస్టు ఒకటవ తేదీ నుంచి యూనిట్ ధర లు మారిపోయాయి. ఈ ఏడాది మార్చి 31 వరకు పెరిగిన ధరలు ఇలా ఉన్నాయి. గతంలో 0- 50 యూనిట్లకు ఒక రేటు ఉండేది. దాన్ని ఇప్పుడు 0-30 యూనిట్లకు చేశారు. 31 నుంచి ఎక్కువ వాడితే ఒక్కో యూ నిట్‌కు ఒక్కో ధర చొప్పున అధిక ధరలు విద్యుత్ యాజమాన్యం నిర్ణయించడంతో ప్రజలపై విద్యుత్ భారాలు అధికంగా పడ్డాయని చెప్పవచ్చు. రాబోవు రోజుల్లో వివిధ పేర్లతో ఛార్జీలు వసూలు చేయాలని ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యం యోచిస్తున్నాయి. ఇదే జరిగితే ఇక విద్యుత్ బిల్లులు అమాంతంగా పెరిగిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే విద్యుత్ ఛార్జీలు కట్టుకోలేక కొట్టుమిట్టాడుతున్న పేద సామాన్య మద్దతు తరగతి కుటుంబాలకు మరిన్ని ఛార్జీల వసూళ్లు అమల్లోకి వస్తే మరి వారి పరిస్థితి ఎలా ఉంటుందో వర్ణనాతీతం అనే చెప్పవచ్చు. గతంలో విద్యుత్ మీటర్లు సాధార ణంగా ఉండేవి. ఎన్ని యూనిట్లు కాల్చితే ఆ యూనిట్లు చూపేవి. ఇప్పుడు వాటి స్థానంలో డిజిటల్ విద్యుత్ మీటర్లను బిగించారు. ఈ డిజిటల్ మీటర్ల వల్ల కరెంటు కాల్చకున్నా కాల్చినట్లు అధిక యూనిట్లు చూపిస్తూ విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయన్న విమర్శలు కూడా ఎక్కువగా వినవస్తున్నాయి. ఈ డిజిటల్ విద్యుత్ మీటర్లను విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఒకసారి పరిశీలించి అవి సక్రమంగా ఉన్నాయో లేదో గమనించి సవరించుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.


విద్యుత్ బిల్లులు పెరగడం దారుణం



విద్యుత్ బిల్లులు విపరీతంగా పెరగడం చాలా దారుణం. కూలీ నాలీ చేసుకొని కష్టపడి కష్టపడి సం పాదించిన డబ్బులు విద్యుత్, గ్యాస్ బిల్లులకే పోతే జీవనం ఎలా సాగించాలో అర్థం కావడం లేదు. గత నెలలో విద్యుత్ బిల్లు ఒక విధంగా వస్తే మరుసటి నెలలో దానికి డబల్ బిల్లు రావటం చూస్తే షాక్ కొట్టినట్లు అయింది. అంత కరెంటు కాల్చకపోయినా కాల్చినట్లు మీటర్ రీడింగ్ చూపించడం దానికి అనుకూలంగా బిల్లు రావడం చూస్తే ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి.

- జానీ కుమార్, రాజారెడ్డి వీధి, కడప.

బిల్లు చూస్తే షాక్ కొడుతోంది



ఇంటికి విద్యుత్ బిల్లు వచ్చిందంటే భయమేస్తుంది. ఎంత బిల్లు వచ్చిందో అన్న టెన్షన్. బిల్లును చూస్తానే షాక్ కొట్టినట్టు అవుతుంది. కష్టపడి సంపాదించింది అంతా ఇంటి అద్దెలకు విద్యుత్, గ్యాస్ బిల్లులకే పోతే ఏం తిని బతకాలి. పైగా వివిధ పేర్లతో కొత్తగా ఛార్జీలు వసూలు చేస్తారనే వార్తలొస్తున్నాయి. విద్యుత్ యాజమాన్యం, ప్రభుత్వం చర్చించుకుని విద్యుత్ బిల్లులు తగ్గించేందుకు తగు చర్యలు తీసుకోవాలి. పేద, సామాన్య మధ్య తరగతి కుటుంబాల విద్యుత్ వినియోగదారులను విద్యుత్ షాక్ నుండి బయట వేయాలని కోరుతున్నాం.

- ప్రసాద్ బాబు, సీయోను పురం, కడప.

'ప్రచార భేరి'ని విజయవంతం చేయండి

-సిపిఎం, సిపిఐ నేతలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపి దేశాన్ని కాపాడాలనే నినాదంతో సిపిఎం, సిపిఐ చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయా పార్టీల జమ్మలమడుగు నేతలు వీరణాల శివనారాయణ, మిడుతూరు ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆ మేరకు వారు స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో శనివారం గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద విధానాలపై అన్న వర్గాల ప్రజలు పోరాడాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు దాసు, దండు.రవి, స్వామి, కృష్ణారెడ్డి, కమాల్ బాషా పాల్గొన్నారు.

విద్యాదాత కందుల శివానందరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె


శివానందరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్

ఎంతో మంది యువతకు విద్యాదానం చేసి, వారి జీవితాల్లో వెలుగు నింపిన గొప్ప వ్యక్తి మాజీ ఎమ్మెల్యే కం దుల శివానందరెడ్డి అని ఐటిఐ ప్రిన్సిపల్ ప్రసాద్‌రావు పేర్కొన్నారు. స్థానిక కందుల ఓబులరెడ్డి పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో శనివారం శివానందరెడ్డి 74వ జయంతి వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐటిఐ సిబ్బంది చంద్రశేఖర్, ఉత్తమారెడ్డి, వెంకటరెడ్డి, ప్రభాకర్ నాయడు, విజయబాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రీన్‌హైవే నగదు రైతుల ఖాతాల్లో జమ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

విజయవాడ-బెంగళూరు గ్రీన్ హైవేకు సంబంధించి భూ ములు కోల్పోయిన రైతుల ఖాతాలో నగదు జమ అయింది. ఆ మేరకు తహశీల్దార్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మొదటి విడతకు సంబంధించి దా దాపు 160 ఎకరాలు సేకరించినట్లు తెలిపారు. మండల పరిధిలోని సుంకేసుల, తిప్పలూరు, కోడూరు, పెదనపాడు గ్రామాల మీదుగా ఆరు లైన్ల గ్రీన్ హైవే వెళుతున్నట్లు తెలిపారు. సుంకేసులకు సంబంధించి సుమారు 31 ఎక రాలు, తిప్పలూరుకు సంబంధించి సుమారు 18 ఎకరాలు, కోడూరుకు సం బంధించి సుమారు 55 ఎకరాలు, పెదనపాడుకు సంబంధించి సుమారు 52 ఎకరాలు హైవే కోసం సేకరించినట్లు వివరించారు. ప్రభుత్వం రైతుల భూములకు నష్టపరిహారంగా సుంకేసుల గ్రామ పొలానికి ఎకరాకు సుమారు రూ.19,45,000, తిప్పలూరు గ్రామ పొలానికి సుమారు రూ.19,20,000, కోడూరు గ్రామ పొలానికి ఎకరాకు సుమారు రూ.14,35,000, పెదనపాడు గ్రామ పొలానికి రూ.11,30,000 ప్రకారం ప్రభుత్వం ధరను నిర్ణయించినట్లు తెలిపారు. కోడూరు గ్రామానికి సంబంధించి సుమారు 12 ఎకరాలకుగానూ దాదాపు ఒక కోటి 80 లక్షల రూపాయలు రైతులు ఖాతాలో జమ అయినట్లు తెలిపారు. అలాగే పెదనపాడుకు సంబంధించి సుమారు 40 ఎకరాలకు దాదాపు నాలుగు కోట్ల 65 లక్షలు, సుంకేసులకు సంబంధించి సుమారు 23 ఎకరాలకు దాదాపు 5 కోట్ల రూపాయలు, తిప్పలూరుకు సంబంధించి సుమారు 11 ఎకరాలకు దాదాపు రెండు కోట్ల 20 లక్షలు ఇప్పటికే రైతుల ఖాతాలో జమ అయిందన్నారు. గత భూములకు సంబంధించిన నగదు త్వరలోనే రైతులు ఖాతాల్లో జమ అవుతుందని ఆయన తెలిపారు. ఇందులో భూములకు, బోర్లకు, పొలం చుట్టూ గోడలకు, పొలాలలో ఉన్న ఇళ్లకు వేర్వేరుగా ధర నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే హైవేకు సంబంధించి ఇంకా భూమి అవసరం కావడంతో రెండో విడత కింద ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తహశీల్దార్ తెలిపారు.


విజయవాడ-బెంగళూరు గ్రీన్ హైవే రోడ్డు నమూనా

జమ్మలమడుగులో పార్కింగ్.. టెన్షన్

- పార్కింగ్ ప్రదేశాన్ని చూపని అధికారులు.. జరిమానాలు విధిస్తున్న పోలీసులు


పార్కింగ్ స్థలంలేక అస్తవ్యస్తంగా ఉన్న వాహనాలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాలతో ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. ఈ సమస్యకు పరిష్కారం ఎప్పుడు లభిస్తుందో అర్థం కాని పరిస్థితి. పార్కింగ్ ప్రదేశం చూపించకుండానే పోలీసులు వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నారు. దీంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. గతంలో చాలా మంది పోలీసు ఉన్నతాధికారులు ట్రాఫిక్ సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి వెళ్ళిపోయారే తప్ప ఆచరణలో కనిపించలేదు. దీనికితోడు పోలీసులే వాహనాలు రోడ్డుకు అడ్డంగా ఉన్నాయంటూ జరిమానాలు విధిస్తున్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా పాత బస్టాండ్ నుండి సంజామల మోటు వరకు ఉంటుంది. పాత బస్టాండ్‌లో ఆర్‌టిసి బస్సులతోపాటు తోపుడుబండ్లు సైతం రోడ్లపైనే నిలిచి ఉంటాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. తహశీల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్, పోలీస్‌స్టేషన్‌కు పనులపై వస్తున్న ప్రజలు తమ వాహనాలను ఎక్కడ పెట్టుకోవాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రహదారిలో వాహనాలు పెడుతుండడంతో పోలీసులు తమ వాహనాలకు అడ్డంగా ఉన్నాయంటూ యజమానులకు జరిమానాలు విధిస్తున్నారు. అవసరాల నిమిత్తం కార్యాలయాలకు వస్తున్నామని, పార్కింగ్ చూపకుండా జరిమానాలు విధించడం ఏంటని వాపోతున్నారు. అయితే తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులు వాహనాలు తమ కార్యాలయం లోపలికి రాకుండా ఏకంగా సరిహద్దులు నిర్ణయించి బండలు పాతేశారు. దీంతో పార్కింగ్ సమస్య మరింత జటిలంగా మారింది. ఉదయం 10 గంటల నుండి పాత బస్టాండ్‌లో ఉన్న తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ట్రెజరీ, పోలీస్‌స్టేషన్ కార్యాలయాలకు అధికారులతోపాటు ప్రజలు కూడా తమ పనులపై ఎక్కువగా వస్తుంటారు. ఆయా కార్యాలయాల్లో ఎక్కడా పార్కింగ్ ప్రదేశం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్ వెళ్లే దారిపై వాహనాలను నిలుపుతున్నారు. పోలీసులు వాహనం ఫొటో తీసి జరిమానాలు విధిస్తున్నారు. ఈ నేపథ్యంలో వాహనదారులు తీవ్ర ఆందోళన చెందు తున్నారు. రోజురోజుకూ పట్టణంలో వాహనాల సంఖ్య పెరుగుతున్నాయని, ఇప్పటికైనా మున్సిపల్, ఆర్‌టిసి, రెవెన్యూ అధికారులు స్పందించి పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మంచితనంతో మెలగాలి : జడ్జి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

సమాజంలో మంచి తనంతో మెలగాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్ సూచించారు. స్థానిక సబ్ జైలులో శనివారం లీగల్ అవేర్ నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ తప్పు చేసే ముందు కుటుంబాల గురించి ఆలోచించాలన్నారు. జైలు జీవితాన్ని గడిపిన వారు ఇకమీదట ఇక్కడికి రాకుండా ఉండేందుకు ప్రయత్నిం చాలన్నారు. సత్ప్రవర్తనతో మెలిగి మంచి పౌరులుగా ఉండాలన్నారు. సొంతంగా న్యాయవాదులను పెట్టుకోలేని వారు తమకు తెలియజేస్తే ప్రభుత్వం తరపున న్యాయవాదిని ఏర్పాటు చేసి బెయిల్ అందిస్తామని తెలిపారు. సబ్ జైల్ సూపరింటెండెంట్ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఖైదీల్లో సత్ప్రవర్తన వచ్చినప్పుడు మరో తప్పు చేసేందుకు ప్రయత్నించరని తెలిపారు. క్షణికావేశంలో చేసిన తప్పులు జీవితకాలం ఒక నేరస్తులుగా ముద్ర పడుతుందన్నారు. న్యాయవాదులు పాలాజీ రవికుమార్, ఖైదీలనుద్దేశించి చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్‌జైల్ పోలీసులు హరినాథ్‌రెడ్డి, నాగార్జున యాదవ్, ఖైదీలు, కోర్టు సిబ్బంది సంధ్యారాణి పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత పాలీ సెట్ కోచింగ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జన విజ్ఞాన వేదిక (జెవివి) ప్రొద్దుటూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి పాలీసెట్ కోచింగ్ ఉచితంగా ఇవ్వనున్నట్లు జెవివి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా క్టర్ వి.వి. శివారెడ్డి, ఎన్.సునీత తెలి పారు. ఆ మేరకు శనివారం స్థానిక జెవివి కార్యాల యంలో గోడ పత్రాలను ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష రాసిన విద్యార్థులకు పాలీసెట్ కోచింగ్‌ను జెవివి అత్యుత్తమ ఫ్యాకల్టీ ద్వారా ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కోచింగ్‌కు రావలసినవారు 97054 32936 ఫోన్ నంబర్‌ను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. స్థానిక శివాలయం పక్కన నందిని క్లాత్ మార్కెట్‌లోని జెవివి కార్యాలయంలో కోచింగ్ ఉంటుందన్నారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ఉపాధ్యక్షులు హేమలత, పట్టణ కమిటీ సభ్యులు మురళీగుప్త, యువ నాయకులు రాజేష్, శర్వాణి, ఆశ్రిత్, భరత్, కార్తిక్, అర్జున్, లిఖితానందరెడ్డి పాల్గొన్నారు.


గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

విభిన్న ప్రతిభావంతులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రంజాన్ మాసంలో విభిన్నప్రతిభావంతులకు సేవ చేయ డం దైవ సేవతో సమానమని ఆల్ ఆఫ్ యు విభిన్నప్రతిభావంతుల, వయోవృద్ధుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అష్ఫల్ తెలిపారు. శని వారం అమృత్‌నగర్‌లో 17 వార్డు నెంబర్ బీబీజాన్, హుస్సేన్‌బాషా కుమారుడు అల్లా బకాష్ ఆధ్వర్యంలో విభిన్నప్రతిభావంతులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వై.చలపతిరావు, ఎంపిటిసి డిష్ శ్రీను, వాలంటరీ సావిత్రి, మల్లేశ్వరి, సంజీవ్ కుమార్, యథార్థుడు, కొండమ్మ పాల్గొన్నారు.

జోరుగా 'జగనన్నే మా భవిష్యత్'

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వైసిపి తలపెట్టిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఆ పార్టీ శ్రేణులు శనివారం జోరుగా నిర్వహించారు. స్థానిక 11వ కౌన్సిల్ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ జైబున్నిసా ఆధ్వర్యంలో వార్డు ఇన్‌ఛార్జి యూసుఫ్ ఇంటింటికి తిరుగుతూ వివ రాలు సేక రిస్తూ, వారి అభిప్రాయం మేరకు స్టిక్కర్లను అతికించారు. 13వ వార్డులో కౌన్సిలర్ కోకోకోలా గౌస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ షర్ఫుద్దీన్ పాల్గొన్నారు. 14వ వార్డులో కౌన్సిలర్ జంషీద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి షాహిద్ పాల్గొన్నారు. 16వ వార్డులో జమ్మలమడుగు నియోజకవర్గ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ భూమిరెడ్డి దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, గృహసారథులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో వైసిపి నాయకులు

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక టిటిడి కల్యాణమండపం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లింగాల మండలం పెద్ద కూడాల గ్రామానికి చెందిన భరత్ అనే యువకుడు తీవ్రంగా గాయ పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. భరత్ తన ద్విచక్ర వాహనంలో జెఎన్‌టియు కాలేజీ నుండి పట్టణంలోకి వస్తుండగా టిటిడి కల్యాణమండపం వద్ద ఆగి ఉన్న వాహనాన్ని ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన భరత్‌ను చికిత్స నిమిత్తం 108 ద్వారా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు. భరత్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


గాయపడిన భరత్

లింగాల : మండల పరిధిలోని లోపట్నూతల గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన శ్రీనివాసులు, సుబ్బరాయుడు మరో మహిళ పార్వతి పొలం పనులు ముగించుకుని, ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా.. అకస్మాత్తుగా ట్రాక్టర్ ఢీ కొంది. దీంతో శ్రీనివాసులకు కుడికాలు రెండు చోట్ల విరగ్గా, పార్వతి అనే మహిళకు చేయి విరిగింది. సుబ్బరాయుడు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేసినట్లు వారి బంధువులు తెలిపారు.

పులివెందులలో చోరీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ఉన్న పుష్పగిరి స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న జతిన్ రోషన్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల వివరాలు మేరకు.. శుక్రవారం రోషన్ అనే వ్యక్తి సాయిబాబా స్కూల్ దగ్గర ఉన్న ఇంటి నుండి మరో ఇంటికి మారుతుండగా రాత్రి మరి కొన్ని సామాన్లు పాత ఇంట్లోనే ఉంచి, అతను వారి బంధువుల ఇంటికి వెళ్లి నిద్రపోయాడు. శనివారం ఉదయాన్నే మిగిలి ఉన్న సామాన్ల కోసం పాత ఇంటికెళ్లగా చోరీ జరిగిన విషయం తెలిసింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న సామాన్లు అన్ని చెల్లాచెదురుగా పడిపోయి ఉన్నాయి. బీరువాలో ఉన్న దాదాపు ఎనిమిది తులాలు బంగారు చోరీకి గురైనట్లు బాధితుడు వాపోయాడు. ఆ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హుస్సేన్ తెలిపారు.